క్లుప్తంగా

వాసవీమాతకు విశేష పూజలు

పామర్రు: ఫాల్గుణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వాసవీ మాత ఆలయంలో విశేష హోమాలు నిర్వహించారు. పౌర్ణమి శుక్రవారం రావటంతో ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, స్నపనలు చేసి పూజలను చేశారు. ఆలయం ప్రాంగణంలో అమ్మవారి మూల మంత్రంతో యజ్ఞం నిర్వహించారు. బొమ్మిశెట్టి దంపతులు పీటలపై కూర్చుని యజ్ఞాన్ని జరిపించారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి వెండి కవచం బహూకరణ



జుఝవరం(పామర్రు): స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలోని ఉపాలయం రాజ్యలక్ష్మి అమ్మవారికి దాతలు వెండి వక్షస్థలాన్ని బహూకరించారని ఆలయ ఈవో వీవీవీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. విజయవాడ రామవరప్పాడుకు చెందిన వత్తుమిల్లి వెంకట రాజేష్, రత్న ప్రశాంతి దంపతులు అమ్మవారికి రూ.77వేల విలువ కలిగిన వెండి వక్షస్థలాన్ని అమ్మవారికి భక్తి పూర్వకంగా బహూకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలను నిర్వహించామన్నారు. అనంతరం ఆలయం తరపున దంపతులను శాలువాలతో సత్కరించారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 10న ప్రారంభం కాగా శుక్రవారం ముగింపు సందర్భంగా ఉదయం నిత్యహోమం, బలిహరణ, శ్రీచక్ర తాళ్వార్ ఊరేగింపు, చూర్ణోత్సవం, వసంతోత్సవం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ద్వాదశారాధనలు, అశ్వవాహనోత్సవం, ధ్వజావరోహణంతో కార్యక్రమాలు ముగిశాయి.

మార్ఫింగ్ ఫొటోల పోస్టింగులు సమాజానికి చేటు



గుడ్లవల్లేరు: సామాజిక మాధ్యమాల్లో మార్ఫింగ్ ఫొటోలతో క్రైస్తవుల మనోభావాలను దెబ్బ తీసేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ లింగం జాన్ బెన్నీ కోరారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఫొటోను ఏసుక్రీస్తుగా మార్ఫింగ్ చేసి, పోస్టు చేశారని ఆరోపిస్తూ ఆయన పాస్టర్లు, ఏసు విశ్వాసులతో కలిసి శుక్రవారం గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పోస్టింగ్ సమాజంలో శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలిగే విధంగా ఉందన్నారు. టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ అనుబంధ సంస్థల కార్యకర్తలు ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాటిని చూసి, ఆవేశానికి గురై దాడులకు పాల్పడితే క్రిమినల్ కేసుల్లో ఇరికించాలనే ఉద్దేశంతోనే ఇలాంటి పోస్టింగులు పెడుతున్నారన్నారు

శేష వాహనంపై లక్ష్మీనృసింహుడు

కైకలూరు: రాష్ట్రంలో 50వ ధర్మక్షేత్రంగా విరాజిల్లుతున్నా వరాహ శ్రీ భూ సమేత శ్రీ లక్ష్మీనృసింహ స్వామి 123వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు శుక్రవారం స్వామివారికి సహస్రనామార్చన, నిత్యహోమం, గ్రామ బలిహరణ, అష్టోత్తర శతనామ పూజ, నిత్యహోమం, బలిహరణ, పుష్పార్చన నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి గ్రామ పురవీధుల్లో శేష, గజవాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

నేటి నుంచి ఆలయ ఆధునికీకరణ పనులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి గర్భాలయ ఆధునికీకరణ పనులను శనివారం నుంచి ప్రారంభించనున్నామని ఆలయ ధర్మకర్తలు రవి, మురాల నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యావహనం, స్వామివారికి చతుర్థశ కలశ స్నపన, వాస్తు పూజ, వాస్తు హోమం, కళాన్యాసం వేద పండితులు చేపట్టనున్నారని చెప్పారు.

లారీ ఢీకొట్టడంతో కూలిన హనుమాన్ ఆలయం

గుడ్లవల్లేరు: విన్నకోట శివారు జేమ్స్‌పేట దళిత వాడలోని గుడ్లవల్లేరు – ముదినేపల్లి ప్రధాన రహదారి పక్కనే వేంచేసిన హనుమాన్ ఆలయాన్ని శుక్రవారం ఉదయం లారీ ఢీకొట్టడంతో కూలిపోయింది. 2009లో కాలవ గట్టుపై కోతి చనిపోవడంతో ఈ గుడిని హనుమాన్ ఆలయంగా ఐదు గ్రామాల ప్రజలు, దాతల ఆర్థిక సహకారంతో రేకుల షెడ్డుగా నిర్మించుకున్నారు. ఆ గుడి కూలిపోవటంతో పునర్ నిర్మాణానికి దాతల కోసం ఎదురు చూస్తున్నారు.

అలంకారప్రాయం.. తాగునీటి పథకం

- తోట్లవల్లూరులో జల్‌జీవన్ మిషన్ కింద రూ.1.14 కోట్లతో నిర్మాణం
- ప్రారంభానికి నోచుకోని మంచినీటి ట్యాంకు
- పైపు లైన్ పూర్తయినా నిరుపయోగమే



తోట్లవల్లూరులో నిరుపయోగంగా మారిన రక్షిత మంచినీటి ట్యాంకు

తోట్లవల్లూరు: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా తోట్లవల్లూరులో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం అలంకార ప్రాయంగా మారింది. ప్రజాప్రతినిధుల ఉదాసీనత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రారంభానికి నోచుకోకుండా నిరుపయోగంగా తయారైంది. ఇంటింటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలనే లక్ష్యం నెరవేరకుండా పోతోంది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన తోట్లవల్లూరు (సౌత్)లో జల్‌జీవన్ మిషన్ పథకం కింద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 1.14 కోట్ల వ్యయంతో సురక్షిత తాగునీటి పథకం నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు లక్ష్యంతో గ్రామంలో సుమారు 7,104 మీటర్ల పొడవునా పైపులైన్‌ను విస్తరించారు. రక్షిత మంచినీటి ట్యాంకు పనులు కూడా త్వరితగతిన పూర్తయ్యాయి. నిధులు సరిపోలేదనే నెపంతో కుళాయిలు మాత్రం మొక్కుబడిగా కొన్ని ఇళ్లకు మాత్రమే ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు.

నిలువెల్లా నిర్లక్ష్యం..

రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మించి, పైపులైను విస్తరించి దాదాపు 19 నెలలు కావస్తోంది. సౌత్ వల్లూరు ఏరియాలో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ నీటి పథకం ప్రారంభం విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ట్యాంకు మోటారుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవటం వల్ల ప్రారంభానికి నోచు కోవటం లేదని తెలుస్తోంది.

నీటి ఇబ్బందిని తొలగించాలి..

ట్యాంకు ప్రారంభానికి అవరోధంగా మారిన విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు రక్షిత నీటి పథకాన్ని త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పనులు పూర్తయినట్లు ఏర్పాటు చేసిన బోర్డు

ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి..

తాగునీటి పథకం నిర్మాణం పూర్తయి దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఇంత వరకు ప్రారంభానికి నోచుకోకుండా ఉండటం మంచిది కాదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్యాంకు ప్రారంభానికి అవసరమైన చర్యలు తీసుకుని, గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి.

– ఈదుగంటి శ్రీను, గ్రామస్తుడు, తోట్లవల్లూరు

నిధుల కోసం ఎదురుచూపు..

ట్యాంకు మోటారుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ మంజూరుకు రూ. 4లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు నిధులు కావాల్సి ఉంది. అంచనా నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరు కాగానే ట్యాంకు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

– సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, తోట్లవల్లూరు

మునిసిపల్ ఎంప్లాయీస్ సొసైటీలో అవకతవకలు

గుడివాడ టౌన్: గుడివాడ మునిసిపల్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ సొసైటీలో పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు(పారిశుద్ధ్య కార్మికులు) ఉన్నారని, రుణం తీసుకునే విషయంలో సభ్యులకు సభ్యులే హామీ ఇచ్చేవిధంగా నిబంధనలు విధించుకున్నామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పూర్తిగా బకాయిలు చెల్లించిన వారికి రుణం తీరినట్లు రశీదులు ఇచ్చినా తిరిగి రుణం చెల్లించాలని నోటీసులు రావడంతో కార్మికులు ఆందోళనకు గురయ్యారు. కేడీసీసీ బ్యాంకు అధికారులను ఈ విషయంపై వివరణ కోరగా ఇంకా బకాయిలు ఉన్నట్లే రికార్డులు చూపుతున్నాయని అధికారులు తెలుపగా కార్మికులు ఆందోళనకు దిగారు. తాము సొసైటీ తరపున ఏర్పరచుకున్న ఓ ప్రైవేట్ ఉద్యోగికి వాయిదాల సొమ్ము చెల్లించామని అతను రశీదు ఇచ్చినా బ్యాంకులో సొమ్ము జమచెయ్యలేదని అంటున్నారు. ఇందులో సొసైటీ అధ్యక్షురాలి పాత్ర కూడా ఉన్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్‌ను కార్మికులు కలిసి తమ ఆవేదన తెలుపగా విచారణ జరిపిస్తామని కమిషనర్ బి. శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వద్దకు వెళ్లి సమస్యను వివరించగా ఆయన కూడా దీనిపై విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

ముగిసిన కూచిపూడి నాట్యోత్సవాలు



ప్రదర్శన ఇస్తున్న దండిభొట్ల నారాయణమూర్తి శిష్య బృందం

కూచిపూడి(మొవ్వ): శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని నాట్య క్షేత్రం కూచిపూడిలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ కూచిపూడి నాట్య శిల్పారామం, శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి పర్యవేక్షణలో శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళావేదికపై సాగిన కూచిపూడి నాట్యాంశాలు ప్రేక్షకుల మన్ననలు అందుకున్నాయి. కావలి చెందిన జయం కూచిపూడి నాట్యాలయం నాట్యాచార్య జాహ్నవి శిష్య బృందం మహిత, సుహిత, లఖితా, ఆరాధ్య, హైదరాబాద్‌కు చెందిన మద్దాలి ఉషా గాయిత్రి శిష్యులు అశ్రిత, యశస్విని, అనంతపురం శ్రీ గురు కృప సంగీత నృత్య కళా నికేతన్ చెందిన డాక్టర్ పట్నం శివప్రసాద్ బృందం సోమనాథ్ భరద్వాజ్, దేవీ చందన, లాలిత్య, రిషిక శ్రీ, ఓజస్వీని, గగనాన్విత, దోహ శ్రీలు, ప్రముఖ సంగీత సాహిత్య నాట్యాచార్య దండిభొట్ల నారాయణమూర్తి(హైదరాబాద్) శిష్యులు లలిత కుమారి, సహస్ర ప్రదర్శించిన అంశాలు ఆహూతులను రంజింపచేశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం కళాకారులను, నాట్యాచార్యులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

జాతీయ క్రీడలలో గుడివాడ ఉపాధ్యాయుల ప్రతిభ



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కోర్టు సభ్యులు

గుడివాడ టౌన్: స్థానిక ఏజీకే షటిల్ కోర్టు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు షటిల్ కోర్టు సభ్యులు తెలిపారు. శుక్రవారం పతకాలు సాధించిన ఉపాధ్యాయులను షటిల్ కోర్టు సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఫిబ్రవరి 6, 7, 8 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రంలోని ఆల్వార్‌లో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు–2025లో తమ కోర్టు సభ్యులు కె. ఎల్. శ్రీనాథ్, ఎస్. ఎస్. నాగమల్లేశ్వరరావు మొత్తం 7 పతకాలు సాధించినట్లు తెలిపారు. నాగమల్లేశ్వరరావు 100 మీటర్ల రిలే పోటీలో బంగారు పతకం, 400 మీటర్ల రిలే పోటీలో మరో బంగారు పతకం, 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం సాధించారన్నారు. శ్రీనాథ్ హేమర్ త్రో, డిస్కస్ త్రోలో బంగారు పతకాలు, షార్టుపుట్‌లో కాంస్యం, 400 మీటర్ల రిలే పోటీల్లో వెండి పతకం సాధించారన్నారు. కార్యక్రమంలో బీసీఈబీ సెక్రటరి షేక్ జానీ సాహెబ్, ఈడె శ్రీనివాస్, ఈడె వెంకటేశ్వరరావు, ఎం. అమ్మన్న బాబు, మీరా హుస్సేన్, కోర్టు సభ్యులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ, మండల పార్టీ అధ్యక్షుల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని గుడివాడ, పెడన మునిసిపాలిటీలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పామర్రు టౌన్‌కు నందిపాటి సురేష్‌రెడ్డి, పామర్రు మండలానికి కాకర్ల వెంకటేశ్వరరావు, మొవ్వ మండలానికి రాజులపాటి రాఘవరావు, పమిడిముక్కల యలమంచిలి గణేష్‌బాబు, పెదపారుపూడి గోగం సురేష్, తోట్లవల్లూరు కళ్లం వెంకటేశ్వరరెడ్డిలను నియమించారు. గుడివాడ పట్టణ అధ్యక్షుడిగా గోర్ల శ్రీనివాసరావు, గుడివాడ మండలానికి చిన్ని సత్యదుర్గాప్రసాద్, గుడ్లవల్లేరు శాయన రవికుమార్, నందివాడ పెయ్యల ఆదాంలను మండల అధ్యక్షులుగా నియమించారు. అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అవనిగడ్డ మండలం రేపల్లె శ్రీనివాసరావు, చల్లపల్లి శీలం సత్యనారాయణ (నాని), ఘంటసాల వేమూరి వెంకట్రావు, కోడూరు పరిశే మాధవరావు, మోపిదేవి గరికిపాటి వెంకటేశ్వరరావు, నాగాయలంక భోగాధి శేషగిరిలను మండలాధ్యక్షులుగా నియమించారు.

చిన్నికి ఆత్మీయ సత్కారం



చిన్ని సత్యదుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న విక్టర్, ఎంపీపీలు

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా చిన్ని సత్యదుర్గాప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా మండలంలోని బొమ్ములూరు గ్రామంలో చిన్ని సత్యదుర్గాప్రసాద్‌ను జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, ఎంపీపీ గద్దే పుష్పరాణి, పార్టీ సీనియర్ నాయకుడు గద్దే రాములు శుక్రవారం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. చిన్ని మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీమంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)లకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు చిన్ని శ్రీనివాసకుమారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కానుకల లెక్కింపు

పామర్రు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీ ఉదయం 10గంటలకు ఆలయంలోని హుండీ కానుకలను లెక్కింపు చేస్తున్నట్లు ఆలయ అధికారి వీవీవీవీ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేవదాయ ధర్మదాయ శాఖ గుడివాడ తనిఖీ అధికారి సమక్షంలో ఈ లెక్కింపు జరుగుతుందని అన్నారు. ఆసక్తి గల వారు అందరూ ఈ లెక్కింపులో పాల్గొనవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని పమిడిముక్కల, కృష్ణాపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల అనంతరం పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పమిడిముక్కల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

శ్యామలాంబ తల్లికి పది విద్యార్థుల పూజలు

కైకలూరు: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 31 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం శ్యామలాంబ తల్లికి వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దేవాలయానికి ఉదయమే పెద్ద ఎత్తున విద్యార్థులు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రేపు అయోధ్యలో సహస్ర శివలింగేశ్వర్ విగ్రహప్రతిష్ట

కై కలూరు: అయోధ్య మహా క్షేత్రంలో సరయూ నది తీరంలో సహస్ర శివలింగేశ్వర్ విగ్రహ ప్రతిష్టను ఆదివారం కైకలూరు షిర్డీ సాయిబాబా మందిర సేవా ట్రస్టు అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు దంపతులు చేయనున్నారు. ఈ నెల 12 నుంచి 16 వరకు జరిగే ప్రతిష్టాపన కార్యక్రమాలకు కైకలూరు నుంచి 200 మంది ఈ నెల 10న అయోధ్య వెళ్లారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

గుడివాడ టౌన్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్‌లో కృష్ణాజిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులను తొలగించవద్దంటూ అందుకు రూ. 15 వందల కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించినా కూటమి ప్రభుత్వం ఆ విషయంలో నిరంకుశ ధోరణి అవలంబిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ ధర్నా నిర్వహిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీకి సొంత నిధులు కేటాయించి ప్రాజెక్టుకు పూర్వ వైభవం తేవాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావు, యూనియన్ కార్యదర్శి అబ్దుల్ కుర్దూస్, నాయకులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు మంచినీటి వసతి



విద్యార్థులకు మంచినీటి సరఫరా కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంఈఓ–2 బాలాజి తదితరులు

గుడివాడ టౌన్: స్వచ్ఛంద సేవా సంస్థలు విద్యార్థుల సౌకర్యం కోసం చేస్తున్న సేవలు అభినందనీయం అని మండల విద్యాశాఖాధికారి–2 బి. బాలాజి అన్నారు. శుక్రవారం స్థానిక ఏజీకే హైస్కూల్‌లో ఈనెల 17 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఏర్పాటు చేస్తున్న మంచినీటి సరఫరా కార్యక్రమం ఆయన ప్రారంభించారు. సభ్యుల సహకారంతో గుడివాడ పట్టణంలోని 17 పరీక్ష కేంద్రాలలో ఈ వసతి ఏర్పాటు చేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు టీఎస్. రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి. కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షుడు ఎం. రమణమూర్తి, సర్వీస్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ మారుతీకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి విశేషాభిషేకాలు



రూ. లక్ష విరాళం అందజేస్తున్న రాఘవులు



పూజలు చేస్తున్న గురుస్వామి సాయిబాబు

పామర్రు: హరిహర పుత్ర అయ్యప్ప స్వామి జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి గుడిలో వైభవంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో నవరసాలతో సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. శత సహస్ర నామాలతో పలురకాల పుష్పాలతో అయ్యప్ప స్వామికి పూజలు చేశారు.

ఘనంగా అయ్యప్ప స్వామి జయంతి..

మండవల్లి: మండవల్లిలో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ అయ్యప్పస్వామి జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పండితులు గూడూరు నాగవెంకటశాస్త్రి ఆధ్వర్యంలో గురుస్వాములు లంకిశెట్టి వెంకట చలపతిరావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు అయ్యప్ప భక్త బృందంతో 27 రకాల పండ్లు, ద్రవ్యాలతో స్వామివారికి కనులపండువగా అభిషేకాలు చేశారు.

రూ.లక్ష విరాళం..

మండవల్లి: మండలంలోని లోకుమూడి ఏలూరు రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయ అభివృద్ధికి కైకలూరుకు చెందిన మండా రాఘవులు శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు. జిల్లాలో ఏకశిల పదునెట్టాంబడితో విరాజిల్లుతున్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు నగదు వితరణగా అందజేసినట్లు దాత చెప్పారు.

హరిగోపాల్ నగర్‌లో సమస్యల తిష్ట

పామర్రు: అభివృద్ధికి ఆమడ దూరంలో హరిగోపాల్ నగర్ ఉందని సీపీఎం నాయకుడు గంగాధర్ పేర్కొన్నారు. స్థానిక హరిగోపాల్‌నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్రను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో 40 మందికిపైగా రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇళ్ల స్థలాలు లేక ఒక్కొక్క ఇంట్లో మూడు కుటుంబాలు ఉంటున్నాయని చెప్పారు. అధిక వర్షాలు కురిసినప్పుడు, గాలులు వీచినప్పుడు కరెంట్ పోయి అంధకారంగా మారుతోందని అన్నారు. ఈ విషయాన్ని స్థానికులు ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు వివరించినా ఫలితం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. పార్టీ జిల్లా నాయకులు పి రంగారావు, ముళ్లపూడి విల్సన్, ఇంటి రాజు, కె నాగభూషణం, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ.. శిరసా నమామి



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళా భక్తులు

తోట్లవల్లూరు: శ్రీలక్ష్మీదేవి జయంతి వేడుకలు మండలంలోని భద్రిరాజుపాలెంలో ఘనంగా జరిగాయి. స్థానిక రాజశ్యామల దేవి ఆలయంలో శ్రీలక్ష్మీదేవి జయంతిని పురస్కరించుకుని అమ్మవారికి శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో రుద్ర ఆధిత్యాది నవగ్రహ మృత్యుంజయ, శ్యామలాదేవి అష్టోత్తర శతనామ సహిత హోమం జరిగాయి.

శ్రీలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు..

తోట్లవల్లూరు: బొడ్డపాడులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీదేవికి శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసమూర్తి ఆధ్వర్యాన లక్ష్మీ అమ్మవారికి 108 తామర పుష్పాలతో హోమం, 108 తామర పూలతో సహస్ర నామార్చన, కుంకుమార్చన ఘనంగా జరిగాయి. ఆయా పూజలలో బొడ్డపాడు, చినపులిపాక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు..

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో లక్ష్మీదేవికి మహిళా భక్తులచే సామూహిక కుంకుమార్చనలను చేపట్టారు. లక్ష్మీదేవి జయంతి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మహిళా భక్తులు ఈ కుంకుమార్చలను వేద మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. తొలుత వేద పండితులు అమ్మవారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను చేపట్టారు. దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ఊంజల సేవ

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి శుక్రవారం రాత్రి ఊంజల సేవను నిర్వహించారు. నవమ పుష్పయాగ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు వివిధ రకాల పుష్పాలతో స్వామివార్లను అలంకరించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల హైస్కూల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ్‌బీ పడాయిబీ'పై అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. వెంట్రప్రగడ, పెదపారుపూడి సెక్టార్‌ల సూపర్‌వైజర్లు ఎం. శివనాగమణి, అరుణ మాట్లాడుతూ చిన్న పిల్లలలో వచ్చే సూక్ష్మపోషకాల లోపాల గుర్తింపు, నివారణ చర్యలను వివరించారు.

17న వీరమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ట

గుడ్లవల్లేరు: మామిడికోళ్లలో నూతనంగా నిర్మించిన శ్రీ వీరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్టను ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా శని, ఆదివారాలు అమ్మవారికి హోమాలతో పాటు ప్రత్యేక పూజాదికాలను వేద పండితులు నిర్వహించనున్నారని చెప్పారు.

17న శ్రీలక్ష్మీగణపతి హోమం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 17న శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తుననట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పూజలో పాల్గొన దలచిన భక్తులు రూ. 516 దేవస్థానం కార్యాలయంలో చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవలసిందిగా కోరారు.